సాక్షి
కుమురం భీం
సోమవారం । 8 । జనవరి । 2024

సారూ.. జీతాలు వస్తలేవ్!

రెండు నెలలుగా జీతాలు అందక సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. 20 ఏళ్లకు పైగా వీరు విధులు నిర్వహిస్తున్నారు.
8లో▸


ఆర్‌కే 5 గనిపై చోరీ
శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే–5 గనిపై శనివారం రాత్రి చోరీ జరిగింది. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు ఘటనా స్థలిని పరిశీలించారు.
8లో▸

గరిష్టం/కనిష్టం
29.4 /17.8
వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. ఉదయం పొగ మంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కడేర్ల వీణకు అవార్డు ప్రదానం

వీణకు అవార్డు అందిస్తున్న స్మితతాయి

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలం సావర్‌ఖేడా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కడేర్ల రంగయ్య సతీమణి టీచర్ కడేర్ల వీణ ఆదివారం నాగ్‌పూర్‌లో సావిత్రీబాయి పూలే అవార్డు అందుకున్నారు. శ్రీ క్షత్రియ కోసరే మాలీ సమాజ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అఖిల భారతీయ సావిత్రీబాయి బ్రిగేడ్ స్మితతాయి ఈ అవార్డును ప్రదానం చేశారు. స్మితతాయి మాట్లాడుతూ ఆటంకాలను తట్టుకొని మారుమూల గ్రామంలో విద్యార్థులకు ఉచితంగా పదేళ్లుగా విద్యాబోధన చేయడం గొప్ప విషయమన్నారు. నేటితరానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో అశోక్‌రావు నికోడే, సుకుమార్ పేట్కులే, ఉత్తమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో భక్తుల సందడి


పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రెబ్బెన మండలంతోపాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల, గోదావరిఖని ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. ఒడిబియ్యం, పట్టు వస్త్రాలతోపాటు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న మహంకాళి విగ్రహం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశా రు.

రిమ్స్‌లో మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తాం

పరికరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని, కార్పొరేట్‌కు దీటుగా సేవలు అందించేలా చర్యలు చేపడతామ ని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎక్స్‌ట్రాకార్పోరియల్ షాక్‌వేవ్ లిథోట్రిప్సీ (ఈఎస్‌డబ్ల్యూఎస్) పరికరాన్ని ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. కిడ్నీలో స్టోన్‌తో బాధపడుతున్న వారికి ఎలాంటి ఆపరేషన్ లేకుండా, నొప్పి తెలియకుండా ఈ యంత్రం ద్వారా వాటిని తొలగించవచ్చన్నారు. రూ.4 కోట్లతో ఈ పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. రిమ్స్‌లో వైద్యుల కొరత కారణంగా ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్లపై కొంత పనిభారం పెరిగినప్పటికీ పేదలకు సేవలు అందించాలని కోరారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలను రక్షించుకోవాలి

మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలలను రక్షించుకోవాలని జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకుల హక్కుల సాధనకు సమష్టిగా కృషి చేయాలన్నారు. పదోన్నతులపై కార్యాచరణ రూపొందించి త్వరలో ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నవీన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గూడు కోసం ఘర్షణ


- కాగజ్‌నగర్ డివిజన్‌లో పెరుగుతున్న పెద్ద పులులు
- పెద్దవాగు, ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లో సంచారం
- కొత్త వాటి రాకతో ఆవాసం, ఆహారం కోసం కొట్లాట
- తాజాగా కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో ఆడ పులి మృతి
- రెండు పులుల మధ్య ఘర్షణతోనే మరణించిందని అధికారుల వెల్లడి


పులి మృతిపై వివరాలు వెల్లడిస్తున్న అటవీశాఖ అధికారులు

బెజ్జూర్(సిర్పూర్): కాగజ్‌నగర్ డివిజన్‌లోని విశాలమైన అడవులు.. పెద్దవాగు, ప్రాణహిత పరీవాహక ప్రాంతాలు పెద్ద పులులకు ఆవాసాలుగా మారుతున్నాయి. మహారాష్ట్ర నుంచి వచ్చే పులులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడంతో జిల్లాలో బెబ్బులి సంతతి గణనీయంగా పెరుగుతోంది. సంతతి పెరగడం శుభవార్తే అయినా.. ఆవాసం కోసం పోటీ పెరిగితే పెద్ద పులుల మనుగడకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. ఉమ్మడి జిల్లాలోని కవ్వాల్ అటవీ ప్రాంతంలో అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నా అక్కడ పులులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. కాగజ్‌నగర్ కారిడార్ పరిధిలో మాత్రం వాటి సంఖ్య పెరుగుతోంది. మరోవైపు అటవీశాఖ పర్యవేక్షణపై అనుమానాలు తలెత్తుతున్నాయి. తాజాగా కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీప్రాంతంలో ఓ రెండేళ్ల ఆడపులి మృత్యువాత పడటం చర్చనీయాంశంగా మారింది.

పర్యవేక్షణ లోపం..
జిల్లాలోని అడవుల్లో వేటగాళ్లు నిత్యం విద్యుత్ ఉచ్చులు పెట్టి వన్యప్రాణులను హతమారుస్తున్నారు. అడవి జంతువులు, పులుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే అపవాదు ఉంది. గతంలో పెద్ద పులుల గోర్లు, చర్మాన్ని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించిన సందర్భాలూ ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో ఆడ పులి మృతి చెందిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోకి ప్రవేశించిన కొత్త పులులపై సరైన పర్యవేక్షణ ఉండటం లేదని తెలుస్తోంది. అందువల్లే రెండు పులులు ఘర్షణ పడే పరిస్థితి వచ్చిందని స్థానికులు అంటున్నారు. వేటగాళ్లు పెట్టిన విషాహారం తిని మరణించి ఉండొచ్చని ప్రచారం సైతం జరుగుతోంది. వేటగాళ్ల పని అయి ఉంటుందా.. లేదా.. అనే దానిపై పులి కళేబరాన్ని పూర్తిస్థాయిలో పరీక్షించిన తర్వాత స్పష్టత రానుంది.

గణనీయంగా పెరిగిన సంతతి
కొన్నేళ్లుగా పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 12 వరకు పెద్ద పులులు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర నుంచి అధికంగా రాకపోకలు సాగిస్తున్నాయి. 2012లో కవ్వాల్‌ను పులుల సంరక్షణ కేంద్రంగా ప్రకటించినా కాగజ్‌నగర్, చెన్నూర్ డివిజన్ల పరిధిలోనే పులుల అలజడి ఎక్కువగా ఉంది. 2014లో కాగజ్‌నగర్ మండలం మాలిని అటవీ ప్రాంతంలో పెద్ద పులి సీసీ కెమెరాకు చిక్కింది. ఆ తర్వాత తర చూ పులులు పిల్లతోపాటు కెమెరాకు చిక్కుతున్నాయి.

వేటగాళ్లతో ముప్పు..
పెద్ద పులులకు ప్రధానంగా వేటగాళ్లతోనే ముప్పు పొంచి ఉంది. అడవి పందులు, జింకలు, దుప్పులు, కొండగొర్రెలు లాంటి జంతువులను వేటాడడం కోసం విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేస్తున్నారు. పులి చర్మం, గోర్లకు మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉండటంతో కొన్ని ముఠాలు అదే పనిలో నిమగ్నమై ఉంటున్నాయి. మహారాష్ట్ర నుంచి రాకపోకలను ట్రాకింగ్ చేయడంలో అటవీశాఖ విఫలమవుతుందనే ఆరోపణలు ఉన్నాయి. రెండు రాష్ట్రాల అధికారుల సమన్వయ లోపంతో పులుల సంచారంపై స్పష్టత ఉండటం లేదు. గతేడాది డిసెంబర్‌లో ఓ పశువుల కాపరిపై దాడి చేసి గాయపర్చిన విషయం తెలిసిందే. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి టైగర్ ట్రాకింగ్ ఫోర్స్‌ను నియమించి పులులను రక్షిస్తున్నామని అటవీ శాఖ చెబుతోంది. సాధారణంగా ఒక్కో పులి వేట కోసం రోజుకు కనీసం 30 కిలోమీటర్ల వరకు సంచరిస్తుంది. రోజుకు రెండుసార్లు నీళ్లు తాగుతుంది. కొన్నిచోట్ల రైతులు పంటల రక్షణకు ఏర్పాటు చేసే విద్యుత్ తీగలు కూడా పులులకు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. 2014లో ఉమ్మడి బెజ్జూర్ మండలంలోని దిందా, గూడెం గ్రామాలకు చెందిన కొంతమంది పులి చర్మాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఏటిగూడ సమీపంలో పట్టుబడ్డారు. అలాగే మూడేళ్ల క్రితం సిర్పూర్(టి) మండలంలో రైలు ఢీకొని పులి మృత్యువాత పడింది.

ఆధిపత్య పోరులో ఆడపులి మృతి

దరిగాం అటవీ ప్రాంతంలో మృతి చెందిన ఆడ పులి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో రెండు పులుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ ఆడ పులి మృతి చెందింది. ఫారెస్టు కంపార్టుమెంట్ నం.62 వద్ద నాలుగు రోజుల క్రితం రెండు ఆడ పులుల మధ్య ఘర్షణ జరిగిందని అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం పశువుల కాపరి చనిపోయిన పులిని చూసి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాడు. అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆదివారం సీసీఎఫ్ శాంతారాం, జిల్లా ఫారెస్టు అధికారి నీరజ్‌కుమార్, స్థానిక అధికారులు ఘటనా స్థలిని క్షుణ్ణంగా పరిశీలించారు. కాగజ్‌నగర్ మండల పరిధిలోని అడవుల్లోనే ఆరు పులులు ఉన్నాయి. ఓ పులి ఆవాసం ఏర్పర్చుకున్న ప్రాంతానికి మరో పులి రావడంతోనే ఘర్షణ జరిగినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. కాలు విరగడంతోపాటు మెడ, నడుము భాగంలో తీవ్రగాయాలై రక్తస్రావం జరిగి పులి మృతి చెందిందని తెలిపారు. రెండు పులులు కొట్లాడిన ప్రాంతానికి సమీపంలోనే డిసెంబర్ 31న ఓ పశువుపై పులి దాడి చేసి చంపివేసినట్లు గుర్తించారు. పశువు కళేబరాన్ని తినే క్రమంలో రెండింటి మధ్య ఘర్షణ జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

శివమల్లన్నకు బోనాలు

ఆలయ ఆవరణలో భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయం ఆవరణలో ఆదివారం భక్తిశ్రద్ధలతో భక్తులు బోనాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తులు బోనాలు వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ ఈవో వేణుగోపాల్ గుప్తా ఆధ్వర్యంలో భక్తులకు వసతులు కల్పించారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

మాట్లాడుతున్న సత్యనారాయణశర్మ

దహెగాం(సిర్పూర్): సనాతన ధర్మాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీడీఎన్ అర్చకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణశర్మ అన్నారు. దహెగాం మండల కేంద్రంలోని శివాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా అధ్యక్షుడు శిరీష్‌శర్మతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ శర్మ మాట్లాడుతూ డీడీఎన్ పథకంలో పని చేస్తున్న అర్చకులు సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమయపాలన పాటిస్తూ ఆలయాలకు హాజరు కావాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను సంఘం దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ నెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆలయాల్లో అలంకరణలు, ప్రత్యేక పూజలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం కమిటీ ప్రతినిధులను సభ్యులు, అర్చకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి సంతోష్‌శర్మ, ఉపాధ్యక్షుడు తిరుపతిచారి, సభ్యులు శ్రీనివాస్‌శర్మ, ప్రశాంత్‌శర్మ, పరమేశ్వర్, విజయ్‌కుమార్, అభయ్ ఆచార్య, ఉపేందర్, కిరణ్, సతీశ్, సూర్యనారాయణ, శేఖర్, కుల్‌కర్ణి బాపుదేవ్ పాల్గొన్నారు.

కొత్త ఓటర్లు @2,061

- ఓటరు ముసాయిదా జాబితా విడుదల
- జిల్లాలో 4,55,599 మంది ఓటర్లు
- ఫిబ్రవరి 8న తుది జాబితా



ఆసిఫాబాద్: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేసింది. జిల్లాలోని 597 పోలింగ్‌కేంద్రాల పరిధిలో 4,55,599 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. వీరిలో 2,27,867 మంది పురుషులు, 2,27,704 మంది మహిళలు, ఇతరులు 28 మంది ఉన్నారు. ఓటరు ముసాయిదాను జిల్లాలోని అన్ని తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నూతన ఓటరు నమోదుకు అవకాశం కల్పించడంతో యువతీ యువకులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. 2023 నవంబర్‌లో ప్రకటించిన ఓటరు తుది జాబితాలో 4,53,538 మంది ఓటర్లు ఉండగా, తాజాగా ఆ సంఖ్య 4,55,599కు పెరిగింది. 2,061 మంది కొత్త ఓటర్లు చేరారు.

పురుషులే అధికం..
ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,55,599కి చేరింది. సర్వీసు ఓటర్లు 398 మంది ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పురుషులు 1,13,199 మంది ఉండగా, మహిళలు 1,14,036 మంది, 17 మంది ట్రాన్స్‌జెండర్లు, 114 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. అలాగే సిర్పూర్ నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,14,668, మంది, మహిళలు 1,13,668 మంది, 11 ట్రాన్స్‌జెండర్లతోపాటు సర్వీసు ఓటర్లు 290 మంది ఉన్నారు. మహిళా ఓటర్లతో పోలిస్తే పురుష ఓటర్లే అధికంగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గతేడాది నవంబర్‌లో తుది జాబితాను విడుదల చేయగా.. పార్లమెంట్ ఎన్నికల కోసం మరోసారి ఎన్నికల సంఘం ఓటు నమోదుకు అవకాశం కల్పించింది.

22 వరకు అభ్యంతరాల స్వీకరణ
ఓటరు ముసాయిదా తుది జాబితాను ఎన్నికల కమిషన్ అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించగా.. జాబితాలో అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 22 వరకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 2న అభ్యంతరాలు పరిష్కరించి, ఫిబ్రవరి 8న తుది జాబితా విడుదల చేయనున్నారు.

శరవేగంగా 'అందవెల్లి'


దహెగాం(సిర్పూర్): కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వద్ద పెద్దవాగుపై వంతెన పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో నెల రోజుల్లో పనులు పూర్తయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. దహెగాం, భీమిని మండలాల ప్రజల రవాణా కష్టాలు తొలగిపోనున్నాయి. కాగజ్‌నగర్– దహెగాం మండలాల మధ్య పెద్దవాగుపై నిర్మించిన వంతెన రెండేళ్ల క్రితం భారీ వరదలకు కుంగిపోగా.. గతేడాది కుంగిన బ్రిడ్జి ఓ వైపు కూలింది. ప్రస్తుతం తాత్కాలిక రోడ్డుపై ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మరమ్మతులకు రూ.13.35 కోట్లు మంజూరు కాగా.. పిల్లర్ల నిర్మాణం పూర్తయింది. పిల్లర్లపై గడర్స్ సైతం ఎక్కించారు. గడర్స్ మధ్య జాయింటింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఆ తర్వాత స్లాబ్ వేయనున్నారు. వంతెన అందుబాటులోకి రానుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దూరమే.. భారం!

- జిల్లాలో రెండు అగ్నిమాపక కేంద్రాలు
- దూరంతో ప్రమాదాల నివారణలో జాప్యం
- మారుమూల మండలాల్లో ఏటా రూ.లక్షల ఆస్తి నష్టం
- అదనంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్


కెరమెరి మండలం ఖైరి గ్రామంలో దగ్ధమైన ఇళ్లు(ఫైల్)

చింతలమానెపల్లి(సిర్పూర్): ఏటా జిల్లాలో అగ్ని ప్రమాదాలు పెరుగుతున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్ పట్టణానికి దూరంగా ఉండే మారుమూల మండలాల్లో ప్రజల ఆస్తులు అగ్నికి ఆహుతవుతున్నాయి. అత్యవసర సేవ అయిన అగ్నిమాపక కేంద్రాలను గ్రామాలకు చేరువచేయడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు నైపుణ్యాలు కలిగిన సిబ్బంది ఆస్తితోపాటు మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించాల్సి ఉంటుంది. కాని దూరాభారంతో సకాలంలో ఫైరింజన్లు ఘటనా స్థలానికి చేరుకోలేకపోతున్నాయి.

జిల్లాలో రెండే కేంద్రాలు..
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాగా ఉన్నప్పుడు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 15 మండలాలకు ఇక్కడి నుంచే సేవలందిస్తున్నారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాలుగా మారడంతో వేగంగా విస్తరిస్తున్నాయి. దీనికి తోడు గ్రామీణ ప్రాంతాల్లో చిన్నతరహా పరిశ్రమలు, పెట్రోల్ పంపులు, జిన్నింగ్, రైస్ మిల్లులు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఏర్పడుతున్నాయి. వ్యవసాయ అవసరాల కోసం గోడౌన్‌లను సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు.

తరచూ అగ్ని ప్రమాదాలు
ఆసిఫాబాద్ డివిజన్‌లో గత మార్చి నుంచి నేటివరకు 18 అగ్ని ప్రమాదాలు జరగగా రూ.20లక్షల ఆస్తి నష్టం జరిగింది. కాగజ్‌నగర్ డివిజన్‌లో 18 ప్రమాదాల్లో రూ.22.50 లక్షల ఆస్తి నష్టం జరిగింది. అధికారిక లెక్కల ప్రకారం జిల్లావ్యాప్తంగా 36 ప్రమాదాలు జరిగినా ఇంతకన్నా ఎక్కువే జరిగినట్లు అంచనా. జిల్లా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారు. వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు, గడ్డి, విత్తనాలు, పంట లాంటి సంబంధిత వస్తువులు ఇళ్లలో ఉంటాయి. దీనికితోడు నిర్మాణానికి కలప, ఇళ్లను కప్పడానికి గడ్డిని వాడుతుంటారు. దీంతో గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు జరగడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. పంటలు సైతం బూడిదగా మారుతుండటంతో నష్టం ఎక్కువగా ఉంటోంది.

ఇటీవల ఘటనలు
- డిసెంబర్‌లో కెరమెరి మండలం ఖైరి గ్రామంలో మూడు ఇళ్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. సుమారు రూ.10లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగింది.
- గత నెలలో చింతలమానెపల్లి మండల కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక ట్రాక్టర్ కాలిపోగా రూ.లక్షల విలువ చేసే వరి పంట అగ్నికి ఆహుతైంది.
- ఈ నెల 6న చింతలమానెపల్లి మండలం గిరవెల్లి గ్రామంలో కొటారి ఇస్తారి రైతు ఇల్లు, పత్తి పంట కాలిపోయాయి. సుమారుగా రూ.6లక్షల ఆస్తి నష్టం సంభవించింది.

70 నుంచి 80 కిలోమీటర్లు
జిల్లాలోని ఫైర్ స్టేషన్లకు దూరంగా ఉన్న గ్రామాలకు అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో చేరుకునే సమయానికి ప్రమాద తీవ్రత పెరుగుతోంది. ఆస్తులు అగ్నికి ఆహుతవుతోంది. సిర్పూర్ నియోజకవర్గంలోని దహెగాం, పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి, బెజ్జూర్, కౌటాల మండలాల్లోని కొన్ని గ్రామాలు ఫైర్ స్టేషన్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అలాగే ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని కెరమెరి, జైనూర్, వాంకిడి, లింగాపూర్ మండలాల గ్రామాలు సైతం 70 నుంచి 80కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. అగ్నిమాపక కేంద్రాల నుంచి ఆయా ప్రాంతాలకు చేరుకోవడానికి సుమారు 2 నుంచి 3గంటల సమయం పడుతుంది.
- జైనూర్ మండలం లింగాపూర్ గ్రామం జిల్లా కేంద్రంలోని అగ్ని మాపక కేంద్రానికి 75 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- కెరమెరి మండలం మహరాజ్‌గూడ జిల్లా కేంద్రానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- బెజ్జూర్ మండలంలోని తలాయి, సోమిని, నాగెపల్లి గ్రామాలు కాగజ్‌నగర్ అగ్నిమాపక కేంద్రం నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- చింతలమానెపల్లి మండలంలోని బూరుగూడ, కోయపెల్లి గ్రామాలు కాగజ్‌నగర్‌లోని అగ్ని మాపక కేంద్రం నుంచి 75 కి.మీ. దూరంలో ఉన్నాయి.
- దహెగాం మండలంలోని మొట్లగూడ, రాంపూర్ కాగజ్‌నగర్‌కు 65 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.
- పెంచికల్‌పేట్ మండలం మురళిగూడ గ్రామం కాగజ్‌నగర్ నుంచి 55కిలోమీటర్ల దూరంలో ఉంది.

కొత్తవి ఏర్పాటు చేస్తే మేలు
ప్రస్తుతం అగ్ని మాపక కేంద్రాలకు గ్రామాలు దూరంగా ఉండటంతో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు వీలుగా కొత్తవి ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. కాగజ్‌నగర్ డివిజన్‌లోని చింతలమానెపల్లి, కౌటాల, బెజ్జూర్ మండలాల పరిధిలో, ఆసిఫాబాద్ డివిజన్‌లో కెరమెరి లేదా జైనూర్ మండలాలలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కొత్త అగ్నిమాపక కేంద్రానికి నివేదికలను సైతం పంపించినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణకు కృషి
"జిల్లాలో అగ్ని ప్రమాదాలు నివారించడానికి మా వంతు కృషి చేస్తున్నాం. దూరం ఎక్కువగా ఉన్న సందర్భాల్లో ఘటన స్థలానికి చేరుకోవడానికి సమయం పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడి వారికి తగిన సూచనలు ఇస్తూ ప్రమాద తీవ్రత తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. పాఠశాలలు, కళాశాలలు, ఆయా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. అత్యవసర సమయంలో 100, 108 నంబర్లకు సమాచారం ఇవ్వాలి."
– రాజేందర్, ఇన్‌చార్జి అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మేక మృతి


మృతి చెందిన మేకతో బాధితుడు

వేమనపల్లి: విద్యుదాఘాతంతో మేక మృతి చెందిన సంఘటన మామడలో చోటు చేసుకుంది. మండలంలోని మామడ గ్రామానికి చెందిన గజ్జి సారయ్య ఆదివారం మేకను మేపేందుకు నీల్వాయి సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తాకడంతో మేక మృతి చెందింది. విద్యుత్ అధికారులు నష్టపరిహారం ఇప్పించాలని బాధితుడు కోరుతున్నాడు.

ప్రాణహితలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


ధర్మయ్య మృతదేహం

బెజ్జూర్: ప్రాణహితలో గల్లంతైన వ్యక్తి మృతదేహం ఆదివారం లభ్యమైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. లోడ్‌పెల్లి గ్రామ పంచాయతీలో కామటిగా పనిచేస్తున్న ఆత్రం ధర్మయ్య (60) బోనాల సందర్భంగా లోడ్‌పెల్లి నుంచి బెజ్జూర్ ప్రాణహిత నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చి గల్లంతయ్యాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి స్వాధీనం


సీజ్ చేసిన వాహనం, నిందితుడితో పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.1 గ్రామానికి చెందిన రాజ్‌సర్కార్ ఆదివారం గంజాయి తరలిస్తూ పట్టుబడినట్లు కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు. విలేజ్ నెం.3 గ్రామానికి చెందిన రాహుల్ మండల్ వద్ద 30 గ్రాముల గంజాయిని కొనుగోలు చేశాడని తెలిపారు. రాహుల్ మండల్ పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రాజ్‌సర్కార్ వద్ద ఉన్న స్కూటర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి వలస కూలీ మృతి

లోకేశ్వరం(ముధోల్): పురుగుల మందు తాగి వలస కూలీ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం కుబీర్ మండలంలోని పల్సి గ్రామానికి చెందిన కుంచపు గణేశ్ (40) తొమ్మిదేళ్ల క్రితం లోకేశ్వరం మండలంలోని పోట్‌పల్లి గ్రామానికి వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం వలస వచ్చాడు. అప్పటి నుంచి గ్రామంలోనే పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

సారూ.. జీతాలు వస్తలేవ్!

- రెండు నెలలుగా విడుదలకాని వేతనాలు
- ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు
- కుటుంబ పోషణ భారంగా మారిన వైనం

జిల్లాల వారీగా సీఆర్పీల వివరాలు	
మంచిర్యాల	596
ఆదిలాబాద్	657
నిర్మల్	702
కుమురంభీం	519
మొత్తం	2,474


మంచిర్యాలలో ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు (ఫైల్)

మంచిర్యాలఅర్బన్/లక్ష్మణచాంద: అసలే అరకొర వేతనాలు.. అవికూడా రెండు నెలలుగా ఇవ్వకపోవడంతో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్లకు పైగా సమగ్రశిక్షలో ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మండల, జిల్లా కార్యాలయాల్లో పలు కార్యక్రమాల అమలులో కీలకంగా వ్యవహరించే ఎయిడెడ్, సమగ్రశిక్ష, కేజీబీవీ, యూఆర్‌ఎస్, ఇతర పాఠశాలల ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో అనేక అవస్థలు పడాల్సి వస్తోంది.

ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు

ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల్లో విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీ సీఆర్టీలు, సీఆర్‌టీలు, ఏఎన్‌ఎం, అకౌంటెంట్‌లు, నాన్ టీచింగ్ సిబ్బంది, మండల, జిల్లా స్థాయిలో ఎంఐసీసీవో, సీసీవోలు, ఐఈఆర్పీలు, సీఆర్పీలు.. ఇలా పలు విభాగాల్లో మొత్తం 2,474 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వారికి గతేడాదికి సంబంధించిన నవంబర్, డిసెంబర్ నెలల వేతనాలు నిలిచిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వచ్చే జీతాలు అంతంత మాత్రమే కావడంతో నెలవారీ ఖర్చులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి.

జీతాల చెల్లింపులు ఇలా..

సమగ్రశిక్ష అభియాన్ నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 శాతంలో మంజూరు చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం తనవంతు వాటా చెల్లించినా రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా జమ చేయకపోవడంతోనే జాప్యం జరుగుతోందని ప్రచారంలో ఉంది. డీఈవో, ఎంఈవో కార్యాలయాల్లో సిబ్బందితో పాటు భవిత కేంద్రాల్లో, కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లో విధులు నిర్వహించే ఉద్యోగులకు కనిష్టంగా నెలకు రూ.5,500 నుంచి రూ.25 వేల వరకు ప్రతినెలా పొందుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా విధులు నిర్వహిస్తున్నా ఇతర సదుపాయాలేమీ వారికి వర్తించడం లేదు.

మంచిర్యాల జిల్లాలో ..

మంచిర్యాల జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 596 మంది ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో కేజీబీవీలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది 424 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరి వేతనాలతో పాటు సరుకులు పంపిణీ చేసే గుత్తేదారులకు కూడా బడ్జెట్ మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. నెలల తరబడి బిల్లులు పేరుకుపోతుండడంతో గుత్తేదారులకు ఎలా చెప్పాలో అర్థంకాక ఎస్‌వోలు తలలు పట్టుకుంటున్నారు. వేతనాలతో పాటు డైస్ బిల్లులు కూడా చెల్లించాలని కోరుతున్నారు.

నిర్మల్ జిల్లాలో...

నిర్మల్ జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 702 మంది ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో డీపీవో సిబ్బంది 8 మంది, కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది 458 మంది, యూఆర్‌ఎస్ బోధన, బోధనేతర సిబ్బంది 13 మంది, ఎంఆర్‌సీ సిబ్బంది 180 మంది, ఎమ్మార్సీ పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ 43 మంది కలిపి మొత్తంగా 702 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వారికి నెలనెలా వేతనం రూ.5,500 నుండి రూ.32,500 వరకు ఉంది.

కుమురంభీం జిల్లాలో

కుమురంభీం జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మొత్తం 519 మంది ఒప్పంద ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో డీపీవో సిబ్బంది ఏడుగురు, కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది 362 మంది, ఎమ్మార్సీ సిబ్బంది 68 మంది, సీఆర్పీ, పీటీఐ సిబ్బంది 82 మంది విధులు నిర్వహిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న మాకు నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన వేతనాలు రావడం లేదు. దీంతో పాఠశాలకు రావడానికి ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

– సౌజన్య, ఆర్ట్ టీచర్, జెడ్పీఎస్ఎస్, మన్మథ్, నిర్మల్

వేతనాలు విడుదల చేయాలి



రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వేతనాలు విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– గంగాధర్, సీఆర్పీ, పల్సి, కుభీర్, నిర్మల్

వారంలోగా వచ్చే అవకాశం



జిల్లాలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో ఒప్పంద ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. కేంద్రం వాటా నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్రం వాటా విడుదల చేయకపోవడంతో వేతనాలు ఆగిపోయాయి. వారంలోగా నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

– రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్



మొక్కలు నాటారు.. సంరక్షణ మరిచారు

మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలోని భీమారం రిజర్వు ఫారెస్ట్‌లో నాటిన మొక్కలకు నీరందించక పోవడంతో ఎండిపోతున్నాయి. గతేడాది అడవిలో చెట్లు లేనిచోట తిరిగి పచ్చదనం కల్పించేందుకు అటవీశాఖ అధికారులు మొక్కలు నాటించారు. కానీ వాటి సంరక్షణ మర్చిపోవడంతో ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా భీమారం జాతీయ రహదారి పక్కనే కోతులకు ఆహారం అందించేందుకు నాలుగేళ్ల క్రితం నాటిన పండ్ల మొక్కలు కూడా నీరు లేక ఎండిపోతున్నాయి. – భీమారం

ఒకరి రిమాండ్

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో శనివారం ఒకరిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని ఆదివారం రిమాండ్ చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొమ్మెన శశికాంత్ రూ.2 వేల విషయంలో అదే గ్రామానికి చెందిన సంగర్తి అరుణ్, అతని తల్లి సుగుణతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో గొడ్డలితో దాడిచేయగా సుగుణకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడు శశికాంత్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

ఆర్‌కే 5 గనిపై చోరీ

- కార్మికుల విలువైన వస్తువులు అపహరణ
- సంఘటన స్థలాన్ని సందర్శించిన కార్మిక సంఘాల నాయకులు


గనిపై పరిశీలిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే–5 గనిపై శనివారం రాత్రి చోరీ జరిగింది. రాత్రి షిఫ్టులో కార్మికులు తమ విలువైన వస్తువులను వారికి కేటాయించిన పెట్టెలలో భద్రపర్చుకుని తాళాలు వేసి గనిలోకి దిగారు. విధులు ముగించుకుని ఆదివారం తెల్లవారు జామున గనిపైకి చేరుకుని పెట్టెల వద్దకు వెళ్లి చూడగా సుమారు 40 పెట్టెల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అందులో భద్రపర్చిన 30 సెల్‌ఫోన్‌లు, రూ.10 వేల నగదు, ఇతర విలువైన వస్తువులు కనిపించకపోవడంతో గని అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదు

ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా మాట్లాడుతూ సంస్థ యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదని విమర్శించారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి వల్లనే కార్మికుల విలువైన వస్తువులు దొంగిలించబడ్డాయన్నారు. కార్మికులకు రెస్ట్ హాల్స్, శాశ్వత కబోర్డులు, వాచ్‌మెన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫిట్ కార్యదర్శి గుడికంటి నర్సింహారావు, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, మల్లేశ్, రాజేశ్, నాగరాజు, తిరుపతి, తదితరులు ఉన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

ఐఎన్టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు మాట్లాడుతూ బాధ్యులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, కేంద్ర ఉపకార్యదర్శి స్వామి, నాయకులు సమ్మిరెడ్డి, పేరం రమేశ్, కే.సురేందర్‌రెడ్డి, ఆర్.మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, నీలం సదయ్య, సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

మంత్రి ‘తుమ్మల’ను కలిసిన ‘దండంరాజ్’

- సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రాంచందర్‌రావు

నస్పూర్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దండంరాజ్ రాంచందర్‌రావు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. శనివారం రాత్రి సంఘం నాయకులతో కలిసి హైదరాబాద్‌లో మంత్రిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల, భద్రాచలం ఆలయాల్లో సింగరేణి ఉద్యోగులకు కల్పిస్తున్నట్లుగానే రిటైర్డ్ ఉద్యోగులకు వసతి సౌకర్యం కల్పించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు అన్నిరకాల వైద్య సేవలు అందించాలని, కరువు భత్యంతో కూడిన పెన్షన్ పెంచాలని, తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట సంఘం ఉప ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్, రిటైర్డ్ డీవైజీఎం రాజు, తదితరులు ఉన్నారు.

మల్వాపై అధికారుల హైరానా...

- బొగ్గులో బురద కలిపితే నాణ్యత లోపించే అవకాశం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో అధికారులు పనికిరాని మల్వా (నల్లని బురద)పై హైరానా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ‘బొగ్గు చోరీ పేరిట .. జేసీబీ, లారీలు స్వాధీనం’ శీర్షికన ‘సాక్షి’లో కథనం ప్రచురితం కావడంతో జేసీబీ, రెండు లారీలు సింగరేణి పరిధిలోకి వచ్చాయని వాహనాలపై రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సింగరేణి ఎస్అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అదే స్థలంలో ప్రస్తుతం మిగిలి ఉన్న మల్వాను జేసీబీ ద్వారా వెలికితీయించిన అధికారులు సీఎస్పీకి తరలిస్తున్నారు. ఐదారేళ్ల క్రితం సింగరేణి సంస్థ ఆర్యన్ కోల్ వాషరీ సంస్థకు బొగ్గు అప్పగించగా క్లీన్ చేసిన బొగ్గును సంస్థకు అప్పగించింది (ప్రస్తుతం వాషరీ సంస్థ పనిచేయడం లేదు) అనంతరం కురిసిన వర్షానికి కోల్ వాషరీ నుంచి బయటకు వచ్చిన మల్వాను అధికారులు సీఎస్పీకి తరలించే పనిలో పడ్డారు. ‘చారాన కోడికి బారాన మసాలా’ అన్న చందంగా పనికిరాని వ్యర్థాన్ని రవాణా చేయడానికి అనవసరంగా మ్యాన్ పవర్ వినియోగించడం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు. అంతే కాకుండా వాటిని మళ్లీ బొగ్గులో కలిపితే నాణ్యత కోల్పోయే అవకాశం కూడా ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై సదరు అధికారిని వివరణ కోరగా కోల్ వాషరీ పక్కనే ఎస్ఎంఎస్ ప్లాంట్‌కు సింగరేణి స్థలం కేటాయించడం జరిగిందని, వారు ఏర్పాట్లకు సిద్ధమవుతున్నారన్నారు. బొగ్గు నుంచి వచ్చిన ప్రతీది వినియోగానికి ఉపయోగపడుతుందని, కోల్ వాషరీ పక్కన నిలువ ఉన్న వ్యర్థాన్ని సీఎస్పీకి తరలించి తర్వాత అధికారుల సూచనల మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.


నల్లటి బురదను వెలికితీస్తున్న జేసీబీ

అంటు మొక్కలు C/O భీమారం

- 200 కుటుంబాలకు ఉపాధి
- రాష్ట్ర వ్యాప్తంగా మొక్కల సరఫరా
- నాణ్యమైనవిగా రైతుల నమ్మకం
- మార్కెటింగ్ సదుపాయం కావాలని వినతి


భీమారం నర్సరీలో పెద్ద మామిడి అంటుమొక్కలు

భీమారం: తియ్యటి పండ్లు అందించే మామిడి తోటల వ్యాప్తికి కీలకమైన మామిడి అంటు మొక్కల నర్సరీలకు భీమారం కేరాఫ్‌గా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందింది. 40 ఏళ్ల క్రితం ప్రముఖ సంఘ సేవకుడు దివంగత ఎన్వీ.రాజారెడ్డి భీమారంలో ఐటీడీఏ ద్వారా అంటు మొక్కల నర్సరీకి తన భూమిని విరాళంగా ఇచ్చాడు. అంటు మొక్కల ఉత్పత్తికి నాంది పలికారు. అది ఇప్పుడు కుటీర పరిశ్రమగా మారింది. మండలంలోని భీమారం, అంకుసాపూర్, తాళ్లగూడెంలోని గిరిజన, దళిత కుటుంబాల రైతులు మొక్కల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఏటా దాదాపు 3 లక్షల మొక్కల వరకు అంటుకట్టి ఏడాది తర్వాత రైతులకు విక్రయిస్తున్నారు.

మొదట ప్రభుత్వపరంగా

దాదాపు 40 ఏళ్ల క్రితం ఐటీడీఏ ద్వారా భీమారంలో ఏర్పాటు చేసిన అంటుమొక్కల నర్సరీల్లో మామిడి మొక్కలకు అంటుకట్టే పద్ధతికి శ్రీకారం చుట్టారు. ఇందులో చెన్నూరు ప్రాంతంలోని వివిధ గ్రామాల గిరిజనులకు భీమారానికి రప్పించి అంటుకట్టడంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఒకవైపు శిక్షణ ఇసూనే మరోవైపు ఐటీడీఏ నర్సరీల్లో లక్షలాది మొక్కలు ఉత్పత్తి చేయడం ప్రారంభించింది. ఇక్కడి మొక్కలు ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సరఫరా చేసేవారు.

ప్రైవేటుకు ప్రోత్సాహం

ప్రభుత్వం ఐటీడీఏ నర్సరీతో పాటు అందులో శిక్షణ పొందిన గిరిజన, దళితులకు బ్యాంకు రుణాలు ఇప్పించి ప్రైవేట్‌గా మామిడి అంటు మొక్కల నర్సరీలను విస్తరించింది. దీంతో అనేక మంది యువకులు నర్సరీలు పెంచుకోవడం ప్రారంభించారు. అయితే అందులో పెంచిన మొక్కలను తిరిగి ప్రభుత్వం కొనుగోలు చేసి రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేసేవారు. దీంతో అనేక కుటుంబాలు నర్సరీలపై ఆధారపడ్డారు.

నిలిపివేతతో ఇబ్బంది..

దాదాపు 20 ఏళ్లక్రితం ఐటీడీఏ గిరిజన, దళిత రైతులు వారి నర్సరీల్లో పెంచిన మొక్కలను కొనుగోలు చేయడాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన భీమారం మొక్కలకు డిమాండ్ అధికంగా ఉండటంతో వివిధ జిల్లాల నుంచి రైతులే స్వయంగా వచ్చి ప్రైవేట్ నర్సీల్లో కొనుగోలు చేయడం ప్రారంభించారు. దాదాపు 200 కుటుంబాలు ఇదే వృత్తిని నమ్ముకుని ఇప్పటికీ అంటు పద్ధతిలో మొక్కలు పెంచి విక్రయిస్తున్నాయి. వీటిని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్‌కు సరఫరా చేస్తున్నారు.

మొక్కల రకాలు

మామిడి మొక్కల పెంపకం ద్వారా ఉపాధి పొందుతున్న నర్సరీలో రైతుల డిమాండ్ మేరకు వివిధ రకాలుపెంచుతున్నారు. ముఖ్యంగా బంగినపల్లి, దసేరి, మల్లిక, కొత్తపల్లి కొబ్బరి రకాలఅంట్లు తీసుకువచ్చి మొక్కలను తయారీ చేస్తున్నారు.వీటి ధర దాదాపు రూ.100 నుంచి 150 వరకు పలుకుతోంది.

ఒక్కో నర్సరీలో..

వ్యవసాయ భూములను లీజుకు తీసుకుని ఒక్కో గిరిజన, దళిత రైతు వెయ్యి నుంచి 3 వేల వరకు మొక్కలు పెంచుతున్నారు. జనవరి వరకు అవసరమైన అంటుని మామిడి తోటల్లో సేకరించి దానిని తల్లిమొక్కకు అంటు కట్టడం చేస్తారు. సంవత్సరం పెరిగిన అనంతరం రైతులకు విక్రయిస్తారు.

అమ్మకానికి 3 లక్షల మొక్కలు

మండలంలోని నర్సరీల్లో 3 లక్షల మామిడి అంటు మొక్కలు అమ్మకానికి ఉన్నాయి. గత సంవత్సరం వర్షాకాలంలో అనుకున్న స్థాయిలో మార్కెటింగ్ కాలేదు. దీనితో గతేడాదితో పాటు ఈసారి కలిపి 3 లక్షలకు చేరుకున్నాయి.

ఆయిల్‌పాం తోటలతో నష్టాలు



నేను 20 ఏళ్ల నుంచి నర్సరీలో మామిడి మొక్కలు పెంచుతున్నా. రెండేళ్ల నుంచి చాలా మంది రైతులు ఆయిల్‌పాం సాగుకు మొగ్గు చూపుతున్నారు. దీని ప్రభావం మామిడి మొక్కల విక్రయాలపై పడింది. అమ్మకాలు తగ్గిపోయాయి.

– సెగ్యం తిరుపతి, నర్సరీ రైతు, భీమారం

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి




గతంలో మాదిరిగా మామిడి మొక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేసి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– గోమాత శేఖర్, నర్సరీ రైతు, అంకుసాపూర్

ప్రచార బోర్డుల తొలగింపు


నాలుగు రాష్ట్రాలను కలిపే ఇందారం క్రాస్ రోడ్డులో హోర్డింగ్‌లు తొలగించిన దృశ్యం

జైపూర్:ఒక్కపక్క జాతీయ రహదారి.. మరోపక్క రాజీవ్ రహదారి.. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లే కీలకమైన కూడలి. మంచిర్యాల–చెన్నూర్ 63వ నంబర్, హైదరాబాద్ రాజీవ్ రహదారిపై ఉన్న ఇందారం క్రాస్ రోడ్డు వద్ద ఎటు చూసినా ప్రకటనల హోర్డింగులే. ఇవి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అటవీశాఖ భూముల్లో హోర్డింగులు పెరుగుతూ వస్తున్నాయి. ఇంత కాలం వాటిపై దృష్టిపెట్టాని అటవీ, ఆర్అండ్‌బీశాఖ అధికారులు ఎట్టకేలకు కొరడా ఝళిపించారు. ఆదివారం కూడలి వద్ద ఏర్పాటు చేసిన హోర్డింగులన్నీ తొలగించారు.


ఇందారం క్రాస్ రోడ్డు ప్రాంతంలో హోర్డింగ్‌లు తొలగించిన దృశ్యం

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

- రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు
- ఆపరేషన్ చేయాలని వైద్యుల సూచన
- ఆందోళనలో నిరుపేద కుటుంబం

దాతలు సాయం చేయాల్సిన నంబర్లు
మోర్లె పాండురంగ్, ఫోన్‌పే,
గూగులే పే నంబర్ 8317507539
అకౌంట్ నంబర్ 62319443930,
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0061739,
బ్రాంచ్: ఎస్‌బీఐ కౌటాల


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకర్

కౌటాల: రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబంలో రోడ్డు ప్రమాదం కష్టాలు తెచ్చిపెట్టింది. వివరాల్లోకి వెళ్తే..కౌటాల మండలంలోని గురుడుపేటకు చెందిన నికాడే శంకర్, లావణ్య దంపతులకు మూడేళ్ల కుమార్తె మేఘన, నాలుగు నెలల కుమారుడు హర్షిత్ ఉన్నారు. రోజు కూలీ పనిచేస్తేనే ఆ కుటుంబం గడుస్తుంది. ఈ నెల 5న శుక్రవారం ఉదయం శంకర్ కూలీ పనుల నిమిత్తం బైక్‌పై కౌటాలకు వెళ్లివస్తుండగా యాపలగూడ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రగాయాలు కావడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన కరీంనగర్‌కు తరలించారు. బ్రెయిన్ ఆపరేషన్ చేయాలని, రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు సూచించారు. దీంతో నిరుపేదలైన ఆ కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కూలీ పనులకు వెళ్తేగాని కుటుంబ పోషణ గడవని పరిస్థితుల్లో అంత డబ్బు ఎలా సమకూర్చాలో తెలియక కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. దాతలు, పాలకులు సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నా భర్తను కాపాడండి



మూడు రోజుల క్రితం నా భర్త నడుపుతున్న బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. తలకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించాం. బ్రెయిన్ ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. చేతిలో చిల్లిగవ్వ లేదు. దాతలు, పాలకులు స్పందించి ఆదుకోవాలి. నా భర్తకు ప్రాణం పోయాలి.

– నికాడే లావణ్య, శంకర్ భార్య, గురుడుపేట